# బాలూ జన్మరహస్యం కథ

(04.06.2006న జరుగుతున్న ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం షష్టిపూర్తి మహోత్సవాన్నిపురస్కరించుకుని..)



సుమారు 60 ఏళ్ళ క్రితం..

సత్యలోకంలో

ఓ రోజు...

నాథా! మీరెంత జీవరాశిని సృష్టించినా పలుకు, చదువు, సంగీతం ఇవన్నీ నా ప్రసాదమే కదా....?" అంది సరస్వతి.

"ఇంతకీ ఇప్పుడేమంటావ్ దేవీ?" అడిగాడు బ్రహ్మ.

మీ సృష్టికి నేను మెరుగులు దిద్దగలను. కానీ వాటిని మరిపించే ఆశ్చర్యానుభూతి నాకు కలిగించగలరా?" అంటూ ప్రశ్నించిందామె.

"చాలా విచిత్రంగా ఉంది దేవీ నీ పందెం... సరే.. ఈ ముచ్చట కూడా నన్ను తీర్చనీ.." అంటూ ఓ జీవిని సృష్టించాడు బ్రహ్మ.

"తన పాటలతో ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోగల సామర్థ్యంగల గళాన్ని ఇతడిని నేను ప్రసాదిస్తున్నాను " అంది సరస్వతి.

"సరే!.. ఆ గళాన్ని ఎవరికైనా సరిపోయే విధంగా మార్చుకోగల తెలివితేటల్ని, శక్తినీ నేనిస్తున్నాను."

"ఆహా...! అయితే ఆ నటరాజు అనుగ్రహంతో ఇతడిని నటుడిగా కూడ మారుస్తున్నాను"

"మధ్యలో శివుణ్ణి కూడా ఇరికించావు కాబట్టి నేను కొంచెం తగ్గుతున్నాను. కానీ నీ కోరిక ప్రకారం నీకు ఆశ్చర్యానుభూతిని ఇవ్వాలిగా .. అంచేత ఇతడు నటుడైనా ఎక్కువ చిత్రాలలో నటించడు. ఎంతోమంది నటులకు డబ్బింగ్ చెబుతూ వాళ్ళ భావప్రకటనలకు మరింత పేరు తెస్తాడు."

"అలా వచ్చేరా.. అయితే ఓ తెలుగు సినిమాలో ఇతనో పాట రాస్తాడంతే.. చూశారా రచయితగా కూడా మార్చాన్నేను"

"పిచ్చి సరస్వతి.. నేనింకో రూట్లో వస్తాను చూడు.. ఇతను తెలుగు సినిమాకి రాసే ఆ పాట ఇంగ్లీష్ పాట అయిపోతుందంతే.."

" నాథా! ఇదన్యాయం.."

"పోన్లే.. మధ్యలో ఓ నాలుగైదు తెలుగు ముక్కలు కూడా పెడతాడ్లే..!"

"ఇంతేనా ఇంకేవన్నా ప్రసాదిస్తావా వరాలు..!?"

"నాథా! నేను కోరింది నా మెరుగులను మరిపించే ఆశ్చర్యానుభూతిని .. అంతేగానీ, శాపాన్ని కాదు"

నాలిక్కరుచుకున్నాడు బ్రహ్మ.

"పొరపాటయిపోయింది దేవీ.. మగతనం మగతలో మాట కాస్త తూలాను. మరి నా వాక్కు కూడా తిరుగులేనిది కదా..!? సరే.. ఆ హోరు సంగీత కాలంలో కూడా మధుర, రమ్య గీతాలను స్వరపరచగలిగే నిబ్బరాన్ని ఇతడిలో నింపుతున్నాను."

"చక్కని సంభాషణా చాతుర్యాన్నిస్తున్నాను నేను"

"అది అతని బంధుమిత్రులకే పరిమితం కాకుండా అందర్నీ అలరించగలిచే విఖ్యాత వ్యాఖ్యాతగా మలుస్తున్నాను"

"ఆ మాటలకు తిరిగి ఇంకేం అనాలో తెలియక ఆలోచనలో పడింది సరస్వతి.

"ఏం దేవీ .. అయిపోయిందా.. ఇంకా వుందా..!?"

పలుకుల రాణికి పదాలు కరవయ్యాయి.

"సరే నేనిప్పుడు అతడికి కొన్ని ఇస్తున్నాను.. వాటిని మించినవి ఇవ్వగలవా?"

అడిగాడు బ్రహ్మ. ఏమిటన్నట్టు ఆసక్తిగా చూసిందామె.

"ఎన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించినా గర్వపుగాలి నింపుకో(లే)ని అంతరంగం, అందులో అన్ని వేళలా ప్రవహించే సంస్కారం వుంచుతున్నాను. అంతేకాదు మీ అత్తగారు లక్ష్మీదేవి తననెంత కరుణించినా- తానెప్పుడూ నీ పక్షమే వహిస్తూ, నీ పుత్రులను గౌరవిస్తూ, వారు రచించిన ఎన్నెన్నో పుస్తకాలకు ఆర్థిక సహాయం చేస్తూ వుంటాడు. నీ మానసపుత్రుడి పేరిట ఓ శిలావిగ్రహం పెట్టిస్తాడు. తనకు గుర్తింపుని ఇచ్చిన గురువు పేరిట మరో పదిమందికి ఉపాధిని కల్పించే ఓ స్వర సాధనాలయాన్ని నిర్మిస్తాడు. అంతేకాదు 'డబ్బు పాపిష్టిది' అని అంటారు కానీ నీ ఇంట కాలు పెట్టినందుకు నన్నానిందల బారినుంచి ఎంత గొప్పగా తప్పించావయ్యా' అని మీ అత్తగారు కూడా ప్రశంసించేలా తన జన్మను చరితార్థం చేసుకుంటాడు. ఇప్పుడు చెప్పు దేవీ... వీటిన్నిటినీ మించినవి ఇంకేమైనా ఇవ్వగలవా నువ్వు...!?"

తలదించుకుంది సరస్వతి అశక్తురాలై.

"అందుకే అంత గీర్వాణం పనికిరాదు గీర్వాణీ..! అంటూ ఆ జీవికి ప్రాణంపోశాడు బ్రహ్మ.

"నాథా.. నేనోడిపోయాయని ఒప్పుకుంటున్నాను. ఇంతకీ ఇతడికి ఏ ఇంట్లో జన్మ ఇస్తున్నారు?"

"సద్బ్రాహ్మణుల వంశంలో.."

"మరి వేదమంత్రాలే వల్లె వేస్తాడేమో..!?"

"లేదు దేవీ.. ఇతడు ఉచ్చరించడు.. ఆచరిస్తాడు. కనుక అవి వేద మంత్రాలు కావు.. స్వేదమంత్రాలు"

"స్వేద మంత్రాలా..!?"

"అవును.. మనం అత్యుత్సాహంతో పోటాపోటీగా ఇచ్చేసిన వరాలతో ఇతడు రోజుకి పద్దెనిమిది గంటలకు పైగా శ్రమిస్తాడు."

"అయితే ఈ ప్రత్యేక సృష్టి ఎన్ని విచిత్రాలు చేస్తుందో నాకు చూడాలని వుంది. త్వరగా పంపండతన్ని భూలోకానికి" అంది సరస్వతి ఆతృతగా.

"అలాగే.." అంటూ ఆశీర్వదించాడు బ్రహ్మ చిరునవ్వుతో..

ఆనాటి ఆ పురాణ దంపతుల సంవాద ఫలితమే.. ఈనాడు షష్టిపూర్తి జరుపుకుంటున్న మన ఎస్.పి. బాల సుబ్రహ్మణ్యం..

(04.06.2006న జరుగుతున్న ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం షష్టిపూర్తి మహోత్సవాన్నిపురస్కరించుకుని..)

-రాజా

raja_musicologist@rediffmail.com